సాక్షి
నిజామాబాద్
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



న్యాయ విద్యార్థులకు..
న్యాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రపంచీకరణ తర్వాత వృత్తిలో అనేక మార్పులు వచ్చాయని జడ్జిలు పేర్కొన్నారు.
- 8లో ▸



ప్రభుత్వ ఆశయాలకు తూట్లు
అంగన్‌వాడీలకు ప్రభుత్వం నిధులిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఫుడ్ కమిషన్ చైర్మన్ అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.4 /27.5
వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రమవుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



వీసీ అక్రమాలపై ఈసీ కొరడా!

తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ అక్రమ వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌లోకి దిగింది. 17 నెలల సుదీర్ఘ విరామం తరువాత ప్రత్యేక పరిస్థితుల్లో బుధవారం హైదరాబాద్‌లోని 'రూసా' భవనంలో టీయూ పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో అనేక పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. వర్సిటీలో అక్రమాలపై 'సాక్షి'లో వచ్చిన కథనాలను పరిశీలించిన ప్రభుత్వం తాజా చర్యలకు పూనుకుంది.



ఈసీ సభ్యులు సమావేశంలో సమర్పించేందుకు తయారు చేసిన బుక్‌లెట్

రిజైన్ చేసి వెళ్లండి..

- టీయూ పాలక మండలి సమావేశంలో రవీందర్ గుప్తాపై నవీన్‌మిట్టల్ ఆగ్రహం
- రోజువారీ ఆర్థిక కార్యకలాపాలకు త్రిసభ్య కమిటీ
- అడ్డగోలు కొనుగోళ్లు, చెల్లింపులు, అక్రమ నియామకాలపై ఐదుగురు సభ్యుల కమిటీ
- నియామకాలన్నీ రద్దు చేసి జీతాల రికవరీకి నిర్ణయం
- విద్యావర్ధినిని సమావేశం నుంచి బయటకు పంపిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ
- సమావేశం నుంచి వాకౌట్ చేసిన వీసీ
- 'సాక్షి' కథనాలకు స్పందన .. బుక్‌లెట్ తయారు చేసి సమావేశానికి తీసుకెళ్లిన ఈసీ సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇప్పటికే అనేకసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు.. తీరు మార్చుకోలేదు.. మీకు అడ్మినిస్ట్రేషన్ పవర్ లేదు.. చేతకాకుంటే పదవికి రిజైన్ చేసి వెళ్లండంటూ తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్‌గుప్తాపై ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ టీయూ పాలకమండలి సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సమావేశం ప్రారంభంలో ఈసీ సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ 'ఎవరు మీరు' అంటూ ప్రొఫెసర్ విద్యావర్ధినిని ప్రశ్నించారు. తాను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌నని చెప్పగా.. మీ నియామకానికి ఈసీ అనుమతి లేదు, బయటికెళ్లాలని వాకాటి కరుణ చెప్పడంతో విద్యావర్ధిని బయటకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో వీసీ రవీందర్ స్పందిస్తూ విద్యావర్ధినిని తాను రిజిస్ట్రార్‌గా నియమించానని, ఆమెను బయటకు వెళ్లగొడితే తనను అవమానించినట్లవుతుందని అన్నారు. ఇందుకు ఉన్నత విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ వీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. కోట్లు స్వాహా చేసిన విషయమై ఇప్పటికే ఈసీ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు అనేక ఫిర్యాదులు చేశారని మిట్టల్ అన్నారు. రవీందర్ గుప్తా వాగ్వాదానికి దిగారు. వాకాటి కరుణ కలుగజేసుకుని ఈసీ అనుమతి లేకుండానే అక్రమ నియామకాలు, అడ్డగోలు కొనుగోళ్లు, చెల్లింపులు ఎందుకు చేశారని వీసీని ప్రశ్నించారు. వెంటనే ఈసీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ విషయమై ప్రశ్నించేందుకు వర్సిటీకి వెళితే వీసీతో పాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని తమపై బెదిరింపులకు పాల్పడడంతో పాటు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రొఫెసర్ నసీం మాట్లాడుతూ తాను డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో తనకు రావాల్సిన 'క్యాస్' ప్రమోషన్ ఆర్డర్ ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. వెంటనే వీసీ రవీందర్ లేచి తాను సమావేశం నుంచి బయటకు వెళ్లిపోతానన్నారు. మీరు సంతోషంగా వెళ్లొచ్చు, రిజైన్ చేసి వెళితే ఇంకా సంతోషమని మిట్టల్ అన్నారు. వీసీ సమావేశం నుంచి బయటకు వెళ్లారు. దీంతో తెలంగాణ యూనివర్సిటీ చట్టం మేరకు ఒక ఈసీ సభ్యుడిని చైర్మన్‌గా తీసుకోవచ్చనే క్లాజ్ ప్రకారం ఈ సమావేశానికి వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహరించారు.

వర్సిటీ పాలన గాడిన పెట్టేందుకు..

2021 డిసెంబర్ 9 నుంచి వీసీ పాల్పడిన అక్రమాలు, అవకతవకలకు సంబంధించి విచారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, ఈసీ సభ్యులు గంగాధర్‌గౌడ్, వసుంధరాదేవి, మారయ్యగౌడ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. అదే విధంగా వర్సిటీలో రోజువారీ కార్యకలాపాల నిర్వహణలో భాగంగా ఆర్థిక అనుమతుల కోసం ఇంటర్నల్ ఈసీ సభ్యులైన నసీమ్, ఆరతి, రవీందర్‌రెడ్డిలను నియమించారు. వర్సిటీలో పాలనను గాడిలో పెట్టేందుకు రెండు నెలల పాటు ప్రతి వారం రోజులకు ఒకసారి పాలకమండలి సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఈ నెల 26న ఈసీ సమావేశం కావాలని నిర్ణయించారు. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో ఈసీ సమావేశాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు ఎస్‌ఎల్ శాస్త్రి, వసుంధరాదేవి, ప్రవీణ్‌కుమార్, గంగాధర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నసీమ్, ఆరతి, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ పాల్గొన్నారు.

'సాక్షి' కథనాల బుక్‌లెట్..

వర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలకు సంబంధించి 'సాక్షి' దినపత్రికలో గతంలో, తాజాగా ప్రచురితమైన కథనాల క్లిప్పింగ్‌లతో కూడిన బుక్‌లెట్‌ను ఈసీ సభ్యులు తయారు చేసుకున్నారు. ఈ బుక్‌లెట్‌తో సమావేశానికి హాజరయ్యారు.

ఆఫ్టాల్ మీరు సభ్యులు..
వీసీ రవీందర్‌గుప్తా

మీదంతా ఫ్రాడ్ దందా..
ఉన్నత విద్యామండలి కమిషనర్ మిట్టల్

ఈసీ సమావేశంలో వీసీ రవీందర్‌గుప్తా, ఉన్నత విద్యామండలి కమిషనర్ నవీన్ మిట్టల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మీకు పని చేతకాదు, రిజైన్ చేయండి, లేదంటే సెలవులో వెళ్లండంటూ వీసీపై నవీన్ మిట్టల్ మండిపడ్డారు. వెంటనే వీసీ రవీందర్ తాను పాలకమండలి చైర్మన్‌నని, మీరు ఆఫ్టరాల్ మెంబర్ మాత్రమేనని అనడంతో.. వాకాటి కరుణ ఒక్కసారిగా వీసీ రవీందర్‌పై ఫైరయ్యారు. మీరు చైర్మన్ అయితే ఈసీ అనుమతి తీసుకోకుండా రూ. కోట్లు ఖర్చు ఎలా చేశారని ప్రశ్నించారు. తాను వర్సిటీ అభివృద్ధి కోసం ఖర్చు చేశానని, తన ఇంట్లో కొనుగోళ్లకు కాదని వీసీ రవీందర్ అన్నారు. స్పందించిన నవీన్ మిట్టల్, మీదంతా ఫ్రాడ్ దందా, క్రిమినల్ మెంటాలిటీ అంటూ వీసీ రవీందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారాలకు కత్తెర..

వీసీ రవీందర్ అధికారాలకు కత్తెర వేస్తూ ఈసీ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా వీసీ పీఏ, పీఎస్, డ్రైవర్‌లను సైతం తొలగించారు. ఇక వీసీ అక్రమంగా నియామకం చేసిన బోధన, బోధనేతర, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, దినసరి సిబ్బంది నియామకాలను రద్దు చేయడంతో పాటు వారికిచ్చిన జీతాలను సైతం రికవరీ చేసేందుకు నిర్ణయించారు. పరిపాలన, అకడమిక్ పదవులు సైతం రద్దు చేశారు. ఈసీ అనుమతి లేకుండా వీసీ నియమించిన శివశంకర్, విద్యావర్ధిని హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, చెల్లించిన జీతాలు, విచ్చలవిడిగా చేసిన ఖర్చుల చెల్లింపుల మొత్తాన్ని, అక్రమ ప్రమోషన్లు పొందిన వారికి ఇచ్చిన జీతాలను వారిద్దరి నుంచే రికవరీ చేయాలని నిర్ణయించారు. అవసరమైతే ప్రభుత్వం తరఫున కలెక్టర్, సీపీ ద్వారా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వాకాటి కరుణ, నవీన్ మిట్టల్ స్పష్టం చేశారు.

విద్యావర్ధిని అవుట్
రిజిస్ట్రార్‌గా యాదగిరి



'సాక్షి'లో ముందే కథనం ప్రచురించిన విధంగా.. విద్యావర్ధినిని తొలగించి ప్రొఫెసర్ యాదగిరినే రిజిస్ట్రార్‌గా గుర్తిస్తున్నట్లు పాలకమండలి ప్రకటించింది. 2021 అక్టోబర్ 30న నియామకమైన యాదగిరే రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నట్లనీ ఈసీ సభ్యులు పేర్కొన్నారు. రెండేళ్ల పాటు యాదగిరి రిజిస్ట్రార్‌గా వ్యవహరించేలా నిర్ణయించారు.

న్యూస్‌రీల్

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ



ఖలీల్‌వాడి: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను బుధవారం బాధితుడికి ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీపీ మాట్లాడుతూ.. ఈనెల 18న సాయంత్రం నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హమాల్‌వాడీ ప్రాంతంలో నిజామాబాద్‌రూరల్ మండలంలోని ఖానాపూర్‌కు చెందిన గండ్ల రాజు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడన్నారు. ఈ సమాచారం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ నంబర్‌ను www.ceir.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపర్చారని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌ను 24 గంటల వ్యవధిలో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ(ఏఆర్) గిరిరాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ(అడ్మిన్) మధుసూదన్‌రావు, నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, ఐటీ కోర్ ఇన్‌చార్జి సీఐ ము ఖీద్ పాషా, టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

తాడ్వాయి: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి సంతోష్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీనిని గమనించిన పోలీసులు మంటలను ఆర్పారు. గాయాలపాలైన సంతోష్‌ను కామారెడ్డి ఆస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆత్మహత్యకు యత్నించిన సంతోష్‌ది తాడ్వాయి మండల కేంద్రం. సెల్‌ఫోన్ విషయంలో వేరే వ్యక్తులతో జరిగిన గొడవ నేపథ్యంలో సంతోష్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చీరావడంతోనే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నట్లు తెలుస్తోంది.

డీసీసీబీలో బకాయిల రికవరీపై చర్చ

నిజామాబాద్‌నాగారం: డీసీసీబీలో రుణ బకాయిల రికవరీ సాధ్యమైనంత వరకు చేయాలని చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ సమావేశాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో చైర్మన్ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డీసీసీబీ రావాల్సిన బకాయిల రికవరీపై చర్చించినట్లు తెలిసింది. అలాగే పలువురు డైరెక్టర్లు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో గజానంద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పుష్కర స్నానం.. చేసేదెట్లా!?

- స్పందించని యంత్రాంగం
- మిగిలింది రెండు రోజులే...
- తాత్కాలిక ఏర్పాట్లైనా చేయాలని కోరుతున్న ప్రజలు

సాక్షి, కామారెడ్డి: నదులకు పుష్కరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మంజీర నదికి పుష్కరాలు వచ్చాయి. సమైక్య రాష్ట్రంలో మంజీర నది పుష్కరాలను నిర్లక్ష్యంగా చేశారన్న విమర్శలుండేవి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటవడంతో ఘనంగా నిర్వహిస్తారని భక్తులు ఆశించారు. కానీ పుష్కరాలకు సమయం సమీపించినా.. ఇప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన 'పుష్కరాలపై నిర్లక్ష్యమేల?' అన్న కథనం చర్చనీయాంశమైంది. గోదావరి పుష్కరాలకు నెలల ముందు నుంచే ఏర్పాట్లు చేసి, విస్తృత ప్రచారం చేసిన ప్రభుత్వం.. మంజీర నది పుష్కరాల విషయంలో నిర్లక్ష్యం చేస్తుందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

పుష్కరఘాట్‌లు లేక ఇబ్బందులు..

ఉమ్మడి జిల్లాలో వంద కిలోమీటర్ల మేర ప్రవహించే మంజీర నది వెంట ఎన్నో పురాతన ఆలయాలు ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరులో నదికి సమీపంలో అతిపురాతన త్రిలింగేశ్వరాలయం ఉంది. అలాగే నది పొడవునా అనేక ఆలయాలు ఉన్నాయి. అనువైన ప్రాంతాలలో ఘాట్లు ఏర్పాటు చేసి పుష్కర స్నానాలకు భక్తులకు అవకాశం కల్పించాల్సిన సర్కారు.. తనకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంజీర నదిలో చాలా చోట్ల పుష్కలంగా నీళ్లున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల నుంచి రెంజల్ మండలంలోని కందకుర్తి దాకా.. పుష్కర స్నానం చేయడానికి అనుకూల ప్రదేశాలెన్నో ఉన్నాయి. అయితే పుష్కర ఘాట్‌లు నిర్మించి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. సర్కారు అలాంటి చర్యలేమీ చేపట్టకపోవడంతో పుష్కర స్నానాలు ఎక్కడ ఆచరించాలన్న విషయమై ఆందోళన చెందుతున్నారు.

పుష్కరాల ప్రారంభానికి రెండే రోజుల సమయం ఉండగా.. కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. పుష్కరాలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గతంలో 2011లో మంజీర పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో బాన్సువాడ సమీపంలో పుష్కర స్నానాలు ఆచరించారు. ఇప్పుడు బాన్సువాడతో పాటు నిజాంసాగర్, నాగిరెడ్డిపేట తదితర మండలాల పరిధిలో మంజీర నదిలో నీరున్న చోట ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం


మాట్లాడుతున్న సునీతరావు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య, నగర అధ్యక్షురాలు రేవతి ఆధ్వర్యంలో జిల్లాలోని మండల మహిళ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్‌ల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాలతో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటనలో సందర్భంగా నిజామాబాద్ జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబంగా మారిందన్నారు. టీఎస్‌పీఎస్ పరీక్ష పత్రాల లీకేజీలో బీఆర్‌ఎస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు. నిరుద్యోగులను తెలంగాణ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దళిత బంధు సామాన్యులకు అందించలేదని కేవలం బీఆర్‌ఎస్ నేతలకు అందించారని విమర్శించారు. తొమ్మిదేళ్లుగా సీఎం కేసీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని, ఎన్నికలు దగ్గర పడడంతో హడావుడిగా విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. సచివాలయాన్ని కూల్చివేసి ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సునీతా రావును డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్ సన్మానించారు. కార్యక్రమంలో మల్లిక, పద్మ, సరోజ పాల్గొన్నారు.

మూడు గంటలు.. 16 శాఖలపై చర్చ

- అధికారులు హాజరు.. ప్రజాప్రతినిధుల డుమ్మా
- సాదాసీదాగా సాగిన జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, జెడ్పీ సీఈవో, అధికారులు

నిజామాబాద్ నాగారం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మూడు గంటల్లోనే 16 శాఖలపై చర్చముగించారు. జిల్లాస్థాయి అధికారులు హాజరైనా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గైర్హాజరయ్యారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాగింది. వ్యవసాయం, డీసీవో, ఐసీడీఎస్, డీఆర్‌డీవో, సివిల్ సప్లై, విద్యుత్, మైనింగ్, మిషన్ భగీరథ, ఆర్ అండ్‌బీ, జీజీహెచ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, ఎస్సీ, ఎస్టీ, పరిశ్రమల శాఖలపై చర్చించారు. ఏశాఖ గురించి చర్చ మొదలైనా చందూర్ జెడ్పీటీసీ ఒక్కరే క్షుణ్ణంగా ప్రశ్నలు లేవనెత్తారు. అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పి దాటవేసే ప్రయత్నం చేశారు. చివరకు అధికార పక్షానికి చెందిన జెడ్పీటీసీలందరూ ప్రశ్నలు సంధించారు.

9 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 467 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు. కడ్తా, తరుగు పేరుతో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా జెడ్పీటీసీ సభ్యులు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఖరీఫ్ సాగుకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో గత డిసెంబర్ 2021, జనవరి 2022లో కురిసిన అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం తరఫున మంజూరైన నష్టపరిహారం పంపిణీ జరుగుతోందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల తాకిడితో దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. కొత్తపల్లి సహకార సంఘంలో అవినీతి అక్రమాలు జరిగాయని సభ్యులు ఆరోపించగా, సమగ్ర విచారణ జరిపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇసుక, మొరం తవ్వకాల ద్వారా సమకూరే సీనరేజీ నిధులను నిబంధనల మేరకు స్థానిక సంస్థలకు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధి హామీ పనులను రైతులకు ఉపయుక్తంగా ఉండేలా చేపట్టాలని, చెడిపోయిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలన్నారు. విరివిగా పండ్ల మొక్కలు నాటించాలన్నారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు వివిధ అంశాలపై ప్రశ్నించారు. జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

పల్లెప్రగతిలో భాగస్వామ్యం కావాలి..

జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం వల్లే దేశంలో అవార్డులు వస్తున్నాయన్నారు. రైతాంగ ప్రయోజనాలు, సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామ సీమలు పచ్చదనం-పరిశుభ్రత సంతరించుకుంటున్నాయన్నారు. ఫలితంగా జాతీయస్థాయిలో తెలంగాణకు వరుస అవార్డులు వరిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాలను మరింతగా అభివృద్ధి బాట పట్టించాలన్నారు. ఈ మేరకు స్థానిక సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు.

రుణ మాఫీ ఎంత చేశారు



జిల్లాలో రైతురుణ మాఫీ ఎంత చేశారు.? ఏక కాలంలో రూ. లక్ష మాఫీ చేస్తామని చెప్పారు. రూ. 75 వేలు మాఫీ చేశారా, రూ. 50 వేలు మాఫీ చేశారా..! పంట నష్టంపై లెక్కలు వేశారా, ఎన్ని ఎకరాల్లో నష్టం జరిగింది. ఎంత సాయం రైతులకు అందింది. ఇసుక రవాణా విషయం గందరగోళంగా ఉంది. ధాన్యం సేకరణలో దళారులు లేకుండా చూడాలి. -అంబర్ సింగ్, చందూర్, జెడ్పీటీసీ

ప్రొటోకాల్ పాటించడం లేదు



ఎడపల్లి మండలంలో ఐసీడీఎస్ అధికారులు సమీక్ష ఏర్పాటు చేసినప్పుడు ప్రొటోకాల్ పాటించడం లేదు. అంగన్‌వాడీ టీచర్లను కింద కూర్చోబెట్టుతున్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వెంటనే చక్కదిద్దాలి. - రజితయాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచే అభివృద్ధి జరుగుతోంది. ఏళ్ల తరబడిగా తెలంగాణకు అన్యాయం జరిగింది. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి. కేంద్రం నుంచి నిధులు రాకున్నా సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పని చేయడం వల్లే దేశంలోనే మన రాష్ట్రానికి అవార్డులు వస్తున్నాయి. - జగన్, జెడ్పీటీసీ, ధర్పల్లి

డీసీవో చిన్నచూపు చూస్తున్నారు



కోటగిరి సహకార సంఘంపై డీసీవో చిన్నచూపు చూస్తున్నారు. సొసైటీని ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలి. -శంకర్, జెడ్పీటీసీ, కోటగిరి

అభివృద్ధికి మళ్లీ పట్టం

తెలంగాణలో, జిల్లాలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. మరింత కష్టపడాలి. అభివృద్ధికే ప్రజలు పట్టం కడతారు. రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో అన్యాయం జరగదు. జరగనివ్వం. - సాంబారి మోహన్, డీసీఎంఎస్ చైర్మన్

క్లుప్తంగా

ఇతర ప్రాంతాల ధాన్యం రాకుండా చూడాలి



రుద్రూర్: జిల్లాలోకి ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. పోతంగల్ మండలం కొడిచర్ల, పోతంగల్ చెక్‌పోస్ట్‌లో బుధవారం ఆయన పర్యటించారు. మంజీర నది సమీపంలో పోతంగల్ చెక్‌పోస్ట్ తనిఖీ చేశారు. మహారాష్ట్ర, సమీపంలోని కామారెడ్డి జిల్లా నుంచి జిల్లాలోకి ధాన్యం తీసుకురాకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొడిచర్ల శివారులో ఐదు గుంటల భూమిని జెండాలు పాతి కబ్జా చేసుకునే యత్నం చేస్తున్నారని ఒకరు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు వివాదాస్పద ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని సర్వే చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పోతంగల్ తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఉన్నారు.

అదనపు జిల్లా జడ్జిగా కనకదుర్గ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా కనకదుర్గ రానున్నారు. ఈ మేరకు హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె గద్వాల జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా ఉన్న శ్రీనివాసరావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఒకరికి కరోనా పాజిటివ్

నిజామాబాద్ సిటీ: జిల్లాలో బుధవారం 49 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎం. సుదర్శనం తెలిపారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం నాలుగు కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు కరోనాపై అప్రమత్తంగా ఉండాలని మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



మాక్లూర్: మత సామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక అని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బుధవారం మాక్లూర్‌లో తహసీల్దార్ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. అనంతరం ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన వస్త్రాలను పంపిణీ చేశారు. వారితో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, అమ్రాద్ విండో చైర్మన్ ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, బడుగు సత్యం, సర్పంచ్ అశోక్‌రావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మల్లారెడ్డి, ఆర్‌ఐ షఫీ, ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, కరీం, కోకా హైమద్, తాజోద్దీన్ పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో అనుమతి లేకుండా అడ్మిషన్లు కొనసాగిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని సాయికాన్సెప్ట్, బోధన్‌లోని శ్రీచైతన్యపాఠశాల, ఆర్మూర్‌లోని నరేంద్రస్కూల్‌లో అనుమతి లేకుండా అడ్మిషన్లు జరుగుతున్నాయని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చినట్లు డీఈవో పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు తూట్లు

- అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు
- ఫుడ్ కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి ఆగ్రహం



భిక్కనూరులో ఐసీడీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి



దోమకొండ ఆస్పత్రిలో సరైన సేవలు అందడం లేదని సూపరింటెండెంట్‌పై ఆగ్రహం..

భిక్కనూరు: చిన్నారులు, మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు మండలంలో పర్యటించారు. గుర్జకుంటలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన అనంతరం భిక్కనూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కుమ్మరిగల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. గర్భిణులకు అందాల్సిన పథకాలు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషక విలువలు గల బియ్యం గురించి అంగన్‌వాడీ టీచర్లను అడగ్గా వారు చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటు అధికారులకు కూడా తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. తామేమో తెలంగాణలో 30 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెబుతున్నామని.. కానీ తన సొంత మండలంలోనే అంగన్‌వాడీల పనితీరు ఈ విధంగా ఉండటం బాధిస్తుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచరుకు అవగాహన కల్పించాలని సీడీపీవో రోశిష్మను నాదేశించారు. ఒకే రోజు అన్ని రికార్డులు రాశారని గుర్తించి ఇది పద్ధతి కాదన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్ల పంపిణీ గురించి తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఎంపీపీ జెడ్పీటీసీలతో పాటు అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల నియామకం కోసం నోటిఫికేషన్ జారీచేయాలని ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. డీఆర్‌డీవో సాయన్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో అనంత్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్య, ఎంపీవో ప్రవీణ్, వైద్యురాలు యెమిమా, ఈవో సదాశివులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ పాల్గొన్నారు.

పథకాల అమలుపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

దోమకొండ: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలపై చాలా మంది అధికారులకు అవగాహన లేదని, పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని లింగుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం దోమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందించే భోజనం నాణ్యతగా లేదన్నారు. సరైన వైద్యం అందించడం లేదని సమయపాలన పాటించి వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగీత్‌కుమార్‌పై అసహనం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఈవో రాజు, ఆర్డీవో శ్రీనివాస్, డిస్ట్రిక్ వెల్ఫేర్ అధికారి రమ్య, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ కౌశిక్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆశంశెట్టి పోశయ్య, మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య ఉన్నారు.

బీజేపీ ఎంపీటీసీపై ఎంపీపీ భర్త దౌర్జన్యం



ఎంపీటీసీ మహిపాల్‌ను బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

సదాశివనగర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసాగా సాగింది. సమావేశంలో ధర్మారావ్‌పేట్ బీజేపీ ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ నేరుగా స్టేజీపై కూర్చున్నారు. ప్రొటోకాల్ ప్రకారం స్టేజీపైన కూర్చోవడానికి అర్హత లేదంటూ స్టేజీపై ఉన్న ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, ఎంపీపీ భర్త రమేశ్ బయటకు వెళ్లగొట్టారు. ప్రొటోకాల్ ఎలా ఉంటదో తనకు చూపించాలని అధికార పార్టీ నాయకులు,అధికారులను మహిపాల్ ప్రశ్నించారు. దీంతో అధికార పార్టీ నాయకులకు, ఎంపీటీసీ మహి పాల్ యాదవ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. అధికార పార్టీ నాయకులు ఎంపీటీసీని ఇష్టారీతిన తిట్టి, బయటకు వెళ్లకపోతే మెడలుపట్టి గెంటేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దృశ్యాలను చిత్రీకరిస్తున్న విలేకరులపై సైతం ఎంపీపీ భర్త ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు సముదాయించి గొడవను సద్దుమణిగేలా చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తునే ఉంటానని మహిపాల్ యాదవ్ పేర్కొన్నారు.

ఎంపీపీ భర్తపై కలెక్టర్‌కు జర్నలిస్టుల ఫిర్యాదు

కామారెడ్డి టౌన్: సదాశివనగర్ ఎంపీపీ అనసూయ భర్త రమేష్‌పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భర్త రమేష్ హాజరుకావడంపై చిత్రికరిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై అసభ్యపదజాలంతో దుర్భాషలాడాడని కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో జర్నలిస్టులు రావద్దని తమపై చేయి చేసుకునేందు యత్నించాడని ఆరోపించారు.

పెంకుటిల్లుకు రూ.53,745 కరెంట్ బిల్లు



కరెంట్ తీసేయడంతో దీపం వెలుగులో సాయిలు కుటుంబం

నిజామాబాద్‌నాగారం: చిన్న పెంకుటిల్లు.. ఇంట్లో రెండు బల్బులు, ఒక్క ఫ్యాన్, టీవీ మాత్రమే ఉంది. ప్రతి నెల కరెంట్ బిల్లు కడుతున్నా ఈ సారి మాత్రం బిల్లులో రూ.53,745 వచ్చింది. మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో సాయిలు ఇంటికి వచ్చిన బిల్లులో రూ.53,745 ఉంది. ఈ నెల బిల్లు రూ.222 కాగా ఏరియర్స్ రూ.53,523 అని ఉంది. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఖంగు తిన్నారు. అధికారుల తప్పిదమో, స్పాట్ బిల్లర్స్ తప్పో, తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కాగా అధికారులు మూడు రోజుల క్రితం ఆ ఇంటికి కరెంట్ కనెక్షన్ తీసేశారు. ఈ విషయమై ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. సదరు మీటర్‌కు మూడేళ్ల పాటు బిల్లు రాలేదని, దీంతో మరమ్మతులు చేసి చూడగా మూడేళ్ల బిల్లు ఒకేసారి వచ్చిందని చెప్పారు.

‘మున్సిపల్ నీటిలో చేప పిల్లల’పై కమిషనర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ నీటిలో చేప పిల్లలు రావడంతో సాక్షి పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా సీరియస్‌గా స్పందించారు. సంబంధిత ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళాయి నీరు అపరిశుభ్రంగా ఉండడం, చేప పిల్లలు రావడంలో నిర్లక్ష్యం చేసిన వారిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

జెడ్పీలో వ్యాపార సముదాయాలు ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జెడ్పీ కార్యాలయ స్థలంలో సుమారు రూ.87 లక్షల వ్యయంతో నిర్మించిన వ్యాపార సముదాయాన్ని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్ బుధవారం ప్రారంభించారు. జెడ్పి సీఈవో గోవింద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్ పాల్గొన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న లారీ



సదాశివనగర్:హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి సదాశివనగర్ శివారులో జాతీయ రహదారిపై రెయిలింగ్‌పైకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతోనే ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య



లింగమణి(ఫైల్)

లింగంపేట: మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ఈరన్న లింగమణి(35) బుధవారం గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. ఆస్తి విషయంలో బుధవారం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన లింగమణి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు కుమారుడు హర్షిత్, కూతురు లక్కి ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలు..

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్‌కు చెందిన దుండగుల లక్ష్మి (80) కడుపునొప్పి భరించలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. లక్ష్మి కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. దీంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి పెద్ద కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వెన్ను నొప్పి భరించలేక..

మాచారెడ్డి: వెన్నుపూస నొప్పి భరించలేక ఒకరు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం మంతన్ దేవునిపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు పరశురాములు (44) ఏడాది కిందట వెన్ను పూస ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా నొప్పి తగ్గ లేదు. అలాగే గతేడాది పంటలు సరిగా పండక అప్పులు చేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పరశురాములు చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో ఒకరు..

తాడ్వాయి: మండలంలోని సంగోజివాడి గ్రామానికి చెందిన రాజయ్య(55) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. వ్యవసాయం చేసుకునే రాజయ్య షుగర్ వ్యాధితో బాధ పడుతున్నాడన్నారు. మూడేళ్ల క్రితం ఆయన కాలుకు కొయ్య గుచ్చింది. చికిత్స చేసుకున్నా గాయం నయం కాలేదు. డాక్టర్లను సంప్రదించగా ఆపరేషన్ చేసి కాలు తొలగించాలని చెప్పారు. దీంతో రాజయ్య రెండు రోజుల తర్వాత హాస్పిటల్‌కు వస్తానని వైద్యులకు చెప్పి ఇంటికి వచ్చాడు. కాలు తొలగిస్తారనే మనస్తాపంతో మంగళవారం రాత్రి గ్రామ శివారులో గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినోద్(ఫైల్)

రాజంపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం ఔరంగాబాద్ తండా శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బుడావత్ వినోద్‌కుమార్(31) మంగళవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న వినోద్‌ను స్థానికులు 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి జమ్లా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

సిరికొండ: గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు బుధవారం తెలిపారు. కువైట్ దేశం పంపిస్తామని సిరికొండకు చెందిన మేకల సంజీవ్, జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన మధు, కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన మహేష్ పదిహేను మంది వద్ద రూ.50 వేల చొప్పున డబ్బులు తీసుకొని మోసం చేశారని ఎస్సై తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కొలిప్యాక రాజ్‌కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తమ్ముడిని చంపాలనుకున్న అక్క

దోమకొండ: రక్తం పంచుకుని పుట్టిన తమ్ముడిని అక్క చంపాలనుకున్న ఘటన దోమకొండలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన రావర్తి రవికి తన సోదరి స్వర్ణ ఫోన్ చేసి దోమకొండలోని తన ఇంటికి రావాలని చెప్పింది. దీంతో ఈ నెల 13న రవి తన అక్క ఇంటికి వెళ్లాడు. వీరికి గతంలో గొడవలు ఉన్నాయి. దీంత తన తమ్ముడిని చంపాలని ముందే పథకం వేసిన స్వర్ణ యాడారం గ్రామానికి చెందిన రావర్తి చంద్రంతో కలిసి హత్యం యత్నం చేసింది. ఈ క్రమంలో రవి కేకలు వేయగా, కాలనీవాసులు వెళ్లి తలుపులు కొట్టి అతడిని బయటకు తీశారు. వారి సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనలో స్వర్ణతో పాటు ఆమెకు సహకరించిన చంద్రంను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు భిక్కనూరు సీఐ తిరుపయ్య తెలిపారు.

న్యాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



సదస్సుకు హాజరైన జడ్జిలతో తెయూ న్యాయ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): న్యాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రపంచీకరణ తర్వాత న్యాయవాద వృత్తిలో అనేక మార్పులు జరుగుతున్నాయని జడ్జీలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా అధ్యక్షతన ముగ్గురు న్యాయాధీశులతో విద్యార్థులకు 'న్యాయవిద్య, న్యాయశాఖలో భవిష్యత్తు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మహేష్‌నాథ్, చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి సంపత్ కుమార్ హాజరై మాట్లాడారు. భారతదేశ ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చొరవతో న్యాయస్థానాలలో కంప్యూటీకరణ ద్వారా సత్వర న్యాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉచిత న్యాయాన్ని ప్రసాదించడం రాజ్యాంగపు మౌలిక లక్షణాల్లో ఒకటన్నారు. జడ్జి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తాను పేద కుటుంబం నుంచి ఈరోజు న్యాయమూర్తిగా ఎదిగానని, తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలోనే న్యాయవిద్యను అభ్యసించానని చెప్పారు. సదస్సుకు హాజరైన ముగ్గురు న్యాయమూర్తులు తెయూ న్యాయ కళాశాలలో పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్లుగా ఉంటూ బుధవారం తమ తమ పరిశోధనా గ్రంథాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు శివకుమార్, శోభారాణి, రామలింగం, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాకతీయ కాలువ

- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం



వెల్కటూర్ శివారులో ధ్వంసమైన కాలువ లైనింగ్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే కాకతీయ కాలువ లైనింగ్ అధ్వానంగా మారింది. ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే ప్రధాన కాలువ లైనింగ్ అధ్వానంగా ఉన్న పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెండోరా మండల కేంద్రంలో, మండలంలోని వెల్కటూర్, వెంచిర్యాల్ శివారులో కాలువ లైనింగ్ ధ్వంసమైంది. ఏ క్షణాన గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. లైనింగ్ మరమ్మతుల కోసం రెండేళ్ల క్రితం ప్రాజెక్ట్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు చిల్లి గవ్వ కూడ మంజూరు కాలేదు. దీంతో పనులు ప్రారంభించలేదు. ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు వారం క్రితం నిలిపివేశారు. ఆగస్టు వరకు ఖరీఫ్ సీజన్‌కు నీటి విడుదల చేసే అవకాశం లేదు. ఈ మధ్య కాలంలో కాలువ లైనింగ్‌కు మరమ్మతులు చేసే అవకాశం ఉంది. పనులు చేపట్టడానికి కూడా అనువుగా ఉంటుంది. కానీ ఇప్పటికీ నిధులు మంజూరు కాక పోతే పనులు ఎప్పుడు టెండర్ చేస్తారు. ఎప్పుడు ప్రారంభిస్తారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు నీరు అందుతుంది.

> **నిధులు మంజూరు కాలేదు**
>
> కాకతీయ కాలువ లైనింగ్ మరమ్మతుల కోసం ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.దీంతో పను లు ప్రారంభించలేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
>
> – రఘుపతి, డిప్యూటీ ఈఈ, పోచంపాడ్

రుణాల కోసం దళారులను ఆశ్రయించొద్దు

నాగిరెడ్డిపేట: యూనియన్ బ్యాంకులో రుణాలు పొందేందుకు ఖాతాదారులు దళారులను ఆశ్రయించవద్దని నిజామాబాద్ యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి దామోదర్‌రెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకులో దళారుల ప్రమేయానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై బుధవారం బ్యాంకులో ఆయన విచారణ జరిపారు. ఈ సందర్భంగా బ్యాంకులో పలువురు ఖాతాదారులతో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలు పొందాలనుకున్నవారు నేరుగా మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తాము రుణాలను అందిస్తామని చెప్పారు. నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, ఎల్లారెడ్డి బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, కామారెడ్డి బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డిటౌన్: తమతో పాటు కూలీ పని చేసే మహిళను ఆభరణాల కోసం హత్య చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన నర్సవ్వ(35)ను రామారెడ్డిలో ఉంటున్న గంభీరావుపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఆస ప్రశాంత్, ఆస సుకన్య, రామారెడ్డి మండలం రంగంపేట గ్రామానికి చెందిన దర్జి ఎల్లయ్య ఈనెల 15న రామారెడ్డిలోని ప్రశాంత్ ఇంట్లో హత్య చేశారు. మొదట వీరంతా ప్రశాంత్ ఇంట్లో కల్లు తాగారు. అనంతరం ఎల్లయ్య నర్సవ్వను అక్కడే బలవంతంగా అనుభవించాడని తెలిపారు. తర్వాత తాడుతో నర్సవ్వ మెడకు చుట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న పుస్తెల తాడు, కమ్మలు, మాటీలు, ముక్కపుడక, పట్టగొలుసులు దొంగలించారు. మృతదేహాన్ని గంభీరావుపేట మండలం నర్మాల కాలువ వద్ద పడేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.రెండు లక్షల విలువ చేసే ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కేసు ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. అడిషనల్ ఎస్పీ అనోన్య, డీఎస్పీ సురేష్ ఉన్నారు.

మూడు బైక్‌లు చోరీ చేసిన వ్యక్తి..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ ప్రాంతంలో వివిధ చోట్ల బైక్‌లను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. బుధవారం బాన్సువాడ–బీర్కూర్ చౌరస్తా వద్ద ఎస్సై దత్తాత్రిగౌడ్ వాహనాలను తనిఖీ చేస్తుండగా బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన తస్నీరు ప్రభాకర్ బైక్‌ను ఆపారు. వాహనం పత్రాలు చూ పించమని అడగ్గా పారిపోయేందుకు యత్నించడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. తన స్నేహితుడైన శ్రీరాం ముత్తేకర్ సాయంతో బాన్సువాడలో మూడు బైక్‌లు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. దొంగిలించిన బైక్‌లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై దత్తాత్రిగౌడ్ ఉన్నారు.

ఆటోల చోరీ కేసుల్లో నిందితులు..



పోలీసులు రికవరీ చేసిన ఆటోలు

లింగంపేట: కొంతకాలంగా ఆటోలను చోరీ చేస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు రికవరీ చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. చోరీకి పాల్పడిన నలుగురిని బుధవారం రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు.. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన సింది సారయ్య, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఎల్లయ్యగూడకు చెందిన మసపాక గణేష్, వరంగల్ జిల్లా పాలకుర్తి మండ లం వాల్‌మిది గ్రామానికి చెందిన బాల్‌గుల శ్యా మ్, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట్ మండలం నిద్దాన్‌పల్లికి చెందిన గోగు రాజు స్నేహితు లు. వీరు మల్కాజ్‌గిరిలో ఉంటూ ఇతరుల ఆటోను కిరాయికి నడిపేవారు. డబ్బులు సరిపోకపోవడంతో ఆటోలను చోరీ చేసి, నంబర్ ప్లేట్ మార్చి తమ సొంత ఆటోలుగా నడిపేవారు. ఈ నెల 9న లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన బాలాగౌడ్ ఆటోను వీరు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారాంగా నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా మరో రెండు ఆటోలను కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

నిజాంసాగర్: మండలంలోని సుల్తాన్‌నగర్‌కు చెందిన దుర్గాదాస్ ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఇంటి బయట పార్కింగ్ చేసిన ట్రాలీని ఎత్తుకెళ్లారని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నవీపేట: మండలంలోని పోతంగల్ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయలైనట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. నవీపేటకు చెందిన ఎర్రబోతు సాయికుమార్ (28) బైక్‌పై పోతంగల్ వైపు వెళ్తుండగా ఆగి ఉన్న ట్రాక్టరును ఢీకొన్నాడు. క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.